సాక్షి
కాకినాడ
సోమవారం । 26 । జూన్ । 2023



రూ.2,50,116 విరాళాలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి డీఆర్‌పీ వర్మ (హైదరాబాద్) రూ.1,00,116, టి.వరలక్ష్మి (పిఠాపురం) రూ.1,50,000 చొప్పున ఆదివారం విరాళాలు సమర్పించారు.



రూ.లక్ష విరాళం

పిఠాపురం: గొల్లప్రోలు కరణంగారి తోటలో కనకదుర్గమ్మ ఆలయ పునర్నిర్మాణానికి పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
32.5° / 24.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	32.5	24.0
కాకినాడ	32.1	24.2
అమలాపురం	32.0	26.0

న్యూస్‌రీల్

కళ్లు చెదిరేలా.. భక్తి ఉప్పొంగేలా..



తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారు.. భక్తిభావన మరింత ఉప్పొంగేలా.. కళ్లు చెదిరేలా.. మట్టిగాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం తొలి ఆదివారం కావడంతో వివిధ రకాల మట్టి గాజులతో అమ్మవారిని విశేషంగా అలంకరించామని ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. నిండు ముత్తయిదువు అలంకరణలో ఉన్న అమ్మవారిని వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఆనందంతో దర్శించారు.

ఉత్సాహంగా తైక్వాండో కలర్ బెల్ట్ ఎగ్జామ్




కలర్ బెల్ట్ ఎగ్జామ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో సంఘం ఆధ్వర్యాన ఆదివారం తైక్వాండో బెల్ట్ ఎగ్జామ్ ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీనగర్ కార్పొరేషన్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షలకు పిఠాపురం, కాకినాడ, అన్నవరం నుంచి 250 క్రీడాకారులు హాజరయ్యారు. ఎల్లో నుంచి రెడ్-1 వరకూ కలర్ బెల్ట్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో థియరీ, ప్రాక్టికల్, సెల్ఫ్ డిఫెన్స్‌లో క్రీడాకారులు పోటీ పడ్డారు. ఆలిండియా బ్లాక్ బెల్ట్ ఎగ్జామినర్, 6డాన్ బ్లాక్ బెల్ట్, ఏషియన్ కోచ్ లైసెన్సీ బి.అర్జునరావు ఈ పరీక్షలు నిర్వహించారు. వారం రోజుల్లో ఫలితాలు వెల్లడించి, నెల రోజుల్లో సర్టిఫికెట్లు అందజేస్తామని ఆయన చెప్పారు. ఇటీవల డెహ్రాడూన్‌లో జరిగిన సీనియర్ నేషనల్స్‌లో మెడల్స్ సాధించిన దివ్య, అఖిల, తేజ, మేరీగోల్డ్‌లకు రూ.2 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అర్జునరావు అందజేశారు.

డెల్టాలకు 5,730 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు ఆదివారం 5,730 క్యూసెక్కుల గోదావరి జలాలను వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.55 అడుగులకు చేరింది.

సత్యధామం.. కొత్త రూపం



అన్నవరం దేవస్థానం

- సత్యదేవుని సన్నిధిలో త్వరలో మాడ వీధులు
- నాలుగు వైపులా 60 అడుగుల వెడల్పున నిర్మాణం
- పలు నిర్మాణాలతో మారనున్న ఆలయ రూపురేఖలు
- రూ.20 కోట్లతో ప్రణాళిక

అన్నవరం: రత్నగిరిపై స్వయంభువుగా వెలసిన భక్తవరదుడు సత్యదేవుని సన్నిధి త్వరలో కొత్త శోభను సంతరించుకోనుంది. స్వామివారికి రథయాత్ర నిర్వహించేందుకు వీలుగా.. దేవస్థానం చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఆలయానికి నాలుగు వైపులా విశాలమైన మాడ వీధుల నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. తిరుమల మాదిరిగానే స్థానిక సత్యదేవుని దివ్యక్షేత్రానికి నలువైపులా 60 అడుగుల వెడల్పున మాడ వీధుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దీంతో ఇప్పటి వరకూ ఇరుకుగా ఉన్న ఆలయ ప్రాంగణం మరింత విశాలం కానుంది.

కార్తికం నాటికి..

అన్నవరం దేవస్థానంలో మొత్తం రూ.20 కోట్లతో కొత్తగా వివిధ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే రత్నగిరికి వచ్చే భక్తులు సులభంగా రాకపోకలు సాగించేలా ఘాట్ రోడ్లు, వాహనాలు నిలిపేందుకు విశాలమైన పార్కింగ్ స్థలం, సీఆర్‌ఓ కార్యాలయం వద్ద కేశఖండనశాలతో పాటు పలు నిర్మాణాలు చురుకుగా జరుగుతున్నాయి. వచ్చే కార్తిక మాసం నాటికి నమూనా ఆలయం, ఘాట్ రోడ్లు, నాలుగు మాడ వీధుల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించినట్లు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ 'సాక్షి'కి ఆదివారం తెలిపారు. ప్రస్తుతం దేవస్థానంలో రూ.10 కోట్లతో వివిధ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారిపై రూ.3.57 కోట్లతో స్వామివారి నమూనా ఆలయం నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



స్వామివారి ఆలయం వద్ద విశాలంగా నిర్మిస్తున్న మెట్లు

భక్తుల కోసం కొండ దిగువన రూ.2 కోట్లతో నాలుగు షెడ్లు, స్వామివారి ఆలయం వద్ద నివేదన శాలకు ఒక షెడ్డు, తూర్పు రాజగోపురానికి దిగువన రెండు షెడ్లు నిర్మిస్తున్నారు.

మాడ వీధులు నిర్మిస్తారిలా..

సత్యదేవుని ఆలయం చుట్టూ నాలుగు మాడ వీధులను 60 అడుగుల వెడల్పున ఈశాన్యం, తూర్పు అధికంగా ఉండేలా నిర్మించనున్నారు. రామాలయం పక్క నుంచి 30 వీవీపీ సత్రం వరకు, అక్కడి నుంచి కేశఖండనశాల దిగువన ఘాట్ రోడ్డును కలుపుకొని మెయిన్ క్యాంటీన్ మీదుగా రామాలయం వరకూ ఈ మాడ వీధులు నిర్మిస్తారు. రామాలయం ఫ్లోరింగ్‌కు సమానంగా ఈ వీధుల నిర్మాణం చేపడతారు. కేశఖండనశాల ఘాట్ రోడ్డును 30 అడుగుల మేర ఎత్తు చేస్తారు. ఈ రోడ్డులో విశాలమైన రథం తిరిగేలా, సుమారు 10 వేల మంది భక్తులు ప్రదక్షిణ చేసేలా మాడ వీధుల నిర్మాణం జరగనుంది.

మరిన్ని నిర్మాణాలు

- సత్యగిరి పక్కన చదును చేస్తున్న స్థలాన్ని 650 కార్లు పట్టేలా అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం మల్టీ లెవెల్ పార్కింగ్ పద్ధతిలో శ్లాబ్ వేయనున్నారు.
- 30 వీవీపీ సత్రాన్ని త్వరలోనే కూల్చివేస్తారు. ఆ స్థలంలో భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తారు.
- సీఆర్‌ఓ కార్యాలయం నుంచి భక్తులు నేరుగా పశ్చిమ రాజగోపురం వద్దకు చేరుకునేలా స్థలాన్ని చదును చేస్తారు.
- సీఆర్‌ఓ కార్యాలయం దిగువ నుంచి రెండో ఘాట్ రోడ్డుకు కొత్తగా 400 మీటర్ల పొడవున రోడ్డు వేస్తున్నారు. ఈ పనులు కార్తిక మాసం నాటికి పూర్తవుతాయి. ఈ రోడ్డు నుంచే భక్తుల వాహనాలను దిగువకు పంపిస్తారు.
- ఆగమ పాఠశాల ముందున్న స్థలాన్ని చదును చేసి, దాతలు ముందుకు వస్తే అతిథి గృహం నిర్మిస్తారు. దాతలు ముందుకు రాకపోతే మినీ శివసదన్ సత్రం నిర్మించాలని నిర్ణయించారు.
- ఆలయంలో ప్రదక్షిణ చేసే మార్గంలో సత్యదేవుని ఉత్సవమూర్తులు, వివిధ దేవతామూర్తుల వెండి విగ్రహాలను గోడలకు అతికించాలని ఆలోచిస్తున్నారు. దీని వలన ప్రదక్షిణ చేసే భక్తులు ఆ విగ్రహాలను దర్శించి, సంతృప్తి పొందే అవకాశం ఉంటుంది.
- సత్యదేవుని ప్రధానాలయానికి ఇరువైపులా ఉన్న మెట్లను విశాలం చేసే పనులు ప్రారంభించారు. దీనివలన రెండు వరుసలలో భక్తులు రాకపోకలు సాగించవచ్చు.

వచ్చే నెలలో భక్తులతో సమావేశం



రత్నగిరిపై మాడ వీధులు, ఇతర నిర్మాణాలపై చర్చించేందుకు వచ్చే నెల మూడో వారంలో భక్తులతో సమావేశం నిర్వహిస్తాం. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటాం. ధర్మకర్తల మండలి సభ్యులను కూడా ఇందులో భాగస్వాములను చేస్తాం. ఈ నిర్మాణాలకు నిధుల సమస్య లేదు. అవసరమైతే ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీజీఎఫ్‌ను వాయిదా వేసి, ఆ మొత్తాన్ని ఇందుకు ఖర్చు చేస్తాం. నిర్మాణాల ప్రణాళికలను దేవస్థానం చైర్మన్ రోహిత్, ట్రస్ట్‌బోర్డు సభ్యులకు వివరించాం.

– ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

నేటి నుంచి రెండు పూటలా పాఠశాలలు

రాయవరం: పాఠశాలలు సోమవారం నుంచి రెండు పూటలా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఎండల ఉధృతి నేపథ్యంలో ఈ నెల 24వ తేదీ వరకూ ఒంటిపూట బడులు నిర్వహించారు. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొనడం, నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు పడటంతో పాఠశాలలు పూర్తి స్థాయిలో నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకూ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ నిర్వహించాలని వివరించారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- 3,500 వ్రతాలు
- రూ.40 లక్షల ఆదాయం



వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి ఆదివారం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తులు సత్యదేవుని ఆలయానికి వస్తూనే ఉన్నారు. స్వామివారి దర్శనం క్యూ లైన్లు, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంత మండపాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. వ్రతాలు 3,500 జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ పర్యవేక్షించారు.

ప్రసాదం విక్రయాలతో రూ.15 లక్షలు

ఆషాఢ మాసం మొదటి ఆదివారం కావడంతో తలుపులమ్మ లోవ దేవస్థానానికి వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో సత్యదేవుని ప్రసాదం కొనుగోళ్లకు క్యూ కట్టారు. దీంతో రికార్డు స్థాయిలో ప్రసాదం విక్రయాలు జరిగాయి. సుమారు 75 వేల ప్రసాదం ప్యాకెట్లు విక్రయాల ద్వారా దేవస్థానానికి రూ.15 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. ఏటా ఆషాఢ మాసంలో ఆదివారం తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు లోవ దేవస్థానానికి తరలి వెళతారు. తిరుగు ప్రయాణంలో అన్నవరంలో ఆగి సత్యదేవుని ప్రసాదాలు కొనుగోలు చేస్తారు. దీనిలో భాగంగా పెద్ద సంఖ్యలో భక్తులు లోవ దేవస్థానానికి తరలి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అన్నవరం తొలి పావంచా వద్ద, జాతీయ రహదారిపై నమూనా ఆలయం వద్ద ఉన్న కౌంటర్లలో ప్రసాదాలు కొనుగోలు చేశారు. భక్తుల రద్దీ నేపథ్యంలో తొలి పావంచా వద్ద అదనంగా రెండు, జాతీయ రహదారిపై నమూనా ఆలయం వద్ద మరో మూడు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి ఏడు గంటల వరకూ రద్దీ కొనసాగింది.

25టియుఎన్130:

నమూనా ఆలయం వద్ద ప్రసాదం కోసం క్యూ కట్టిన భక్తులు

లోవకు పోటెత్తిన భక్తులు



లోవలో భక్తులు, వాహనాల రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి సన్నిధికి భక్తులు పోటెత్తారు. ఆషాఢ మాసం తొలి ఆదివారం కావడంతో వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. క్యూలైన్ల ద్వారా 30 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాద విక్రయాల ద్వారా రూ.3,37,320, పూజా టిక్కెట్లకు రూ.2,90,250, కేశఖండనశాలకు రూ.20,375, వాహన పూజలకు రూ.6,350, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.1,15,712, విరాళాలుగా రూ.2,39,628 కలిపి మొత్తం రూ.10,09,635 ఆదాయం సమకూరిందని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దేవస్థానంలో వసతి గదులు నిండిపోయాయి. దీంతో వేలాదిగా భక్తులు ఆలయ ప్రాంగణంలో చెట్ల కింద, ఘాట్ రోడ్డు దిగువన ప్రైవేట్ కాటేజీల్లోను వసతి ఏర్పాటు చేసుకుని వంటలు, భోజనాలు చేశారు. రూరల్ సీఐ ఆధ్వర్యాన తుని పట్టణ సీఐ, తుని రూరల్, కోటనందూరు ఎస్సైలతో సహా 40 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేడు డయల్ యువర్ కలెక్టర్

కాకినాడ సిటీ: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకూ నిర్వహిస్తున్నామని కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు 1800 425 3077 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చన్నారు. అలాగే ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయం గమనించాలని కలెక్టర్ సూచించారు.

మత్తుపై ఉక్కుపాదం

- ముమ్మరంగా దాడులు
- ఐదేళ్లలో 584 మంది స్మగ్లర్ల అరెస్టు
- మరోపక్క విద్యార్థులకు అవగాహన సదస్సులు
- ప్రజలను చైతన్యవరిచేలా ప్రచారం
- తక్షణ ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 14500
- నేడు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం

కాకినాడ క్రైం: అమాయక యువతే లక్ష్యంగా కొందరు సంఘ విద్రోహశక్తులు మాదక ద్రవ్యాల వల విసురుతున్నారు. కొద్దికొద్దిగా అలవాటు చేస్తూ మత్తు ఊబిలోకి లాగేస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. శాంతిభద్రతల విభాగంతో పాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పోలీసులు డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాలపై పకడ్బందీ ప్రణాళికతో విస్తృత దాడులు చేస్తున్నారు. మత్తు విపత్తును ముందుగానే గ్రహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొన్నేళ్ల క్రితమే మాదక ద్రవ్యాల నివారణ యజ్ఞానికి పూనుకున్నారు. స్మగ్లర్ల భరతం పట్టేందుకు పోలీసు శాఖలో ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఏర్పాటు చేశారు. దీనిపై పర్యవేక్షణకు ఐపీఎస్ ర్యాంకు అధికారులను జిల్లాల వారీగా నియమించారు. ఈ నేపథ్యంలో పోలీసులు, సెబ్ అధికారులు మత్తు రక్కసుల భరతం పడుతున్నారు. ఫలితంగా జిల్లాలో మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట పడుతోంది. సోమవారం–అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పోలీసులు, సెబ్ అధికారులు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మూడంచెల నిఘా

మాదకద్రవ్యాల స్మగ్లర్లకు సెబ్ అధికారులు, పోలీసులు పక్కా ప్రణాళికతో అడ్డుకట్ట వేస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాతో పాటు ఎండీఎంఏ ఉనికీ జిల్లాలో బయటపడింది. స్మగ్లర్లకు విద్యార్థులే ప్రధాన లక్ష్యంగా ఉండటంతో అధికారులు పాఠశాలలు, కళాశాలలపై దృష్టి పెట్టారు. గంజాయి సహా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నియంత్రించేందుకు పోలీసులు, సెబ్ సంయుక్త ఆధ్వర్యాన మూడంచెల పర్యవేక్షణ కొనసాగుతోంది. పెడ్లర్లు (అమ్మకందారులు), వినియోగదారులు, సప్లయర్లు (పంపిణీదారులు) అనే ఈ మూడంచెలపై పోలీసులు పటిష్టమైన నిఘా పెట్టారు. ఎక్కడైనా గంజాయి పట్టుబడితే ఈ విధానంలో దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి ఎవరు అమ్మారు, ఎవరు కొన్నారు, పంపిణీ చేస్తున్నది ఎవరు, ఎలా చేశారు అనే విషయాలను ఈ మూడంచెల విధానంలో **రాబడతారు. జనం రద్దీ తక్కువగా ఉంటున్న ప్రాంతాలు, డంప్ యార్డులు, కాకినాడ పోర్టు పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగుతోంది. గంజాయి సహా మత్తు విక్రయదారులపై పీడీ కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం విక్రయాలకు పాల్పడుతున్న** 15 మంది, గంజాయి విక్రయాలు నిత్యకృత్యంగా మారిన ముగ్గురిపై పీడీ కేసులు నమోదు చేశారు. వీరిలో 15 మంది నిందితులు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు.

విస్తృతంగా అవగాహన

అక్రమార్కుల భరతం పడుతూనే సమస్య మూలాల్లోకి వెళ్లి, మాదక ద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించే చర్యలను సెబ్ చేపడుతోంది. ఇందులో భాగంగా సెబ్ జిల్లా ప్రత్యేక అధికారి ప్రేమ్ కాజల్ ఆధ్వర్యాన ప్రతి నెలా కనీసం రెండు విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులతో మమేకమవుతున్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, దానివలన కలిగే నష్టం, వినియోగించినా, విక్రయించినా, తరలించినా తీసుకునే చట్టపరమైన చర్యలు, కోర్టు విధించే శిక్షలపై అవగాహన కల్పిస్తున్నారు. మాదకద్రవ్యాలపై తక్షణ సమాచారం, ఫిర్యాదులకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 14500పై కూడా చైతన్యపరుస్తున్నారు.



జీజీహెచ్‌లో చికిత్స

మాదక ద్రవ్యాలకు బానిసలైన పలువురికి కాకినాడ జీజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు. 2020లో 1,191 మంది, 2021లో 3,126 మంది, 2022లో 3,984 మంది, ఈ ఏడాది మే నెల వరకూ 1,512 మంది జీజీహెచ్‌లో చేరారు. వీరిలో 23 మంది యువతులు కూడా ఉండటం గమనార్హం.



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సెబ్ అధికారి (ఫైల్)

ఐదున్నరేళ్లుగా గంజాయిపై చేసిన దాడుల వివరాలు

సంవత్సరం	కేసులు	పట్టుబడిన గంజాయి	విలువ (కిలోల్లో)	అరెస్టులు (రూ.లలో)
2018	15	2,333	40.60 లక్షలు	38
2019	25	2,717.40	43.86 లక్షలు	69
2020	46	4,822.23	1.07 కోట్లు	124
2021	63	15,726.78	6.97 కోట్లు	200
2022	36	6,821.58	1.70 కోట్లు	112
2023 (జూన్ 25 వరకూ)	11	1,357.68	29.50 లక్షలు	41
మొత్తం	196	33,778.67	10.88 కోట్లు	584



తునిలో భారీగా గంజాయితో స్మగ్లర్లను పట్టుకున్న పోలీసులు

ప్రయత్నిస్తారు.. బానిసవుతారు..



మత్తు మజా ఎలా ఉంటుందో ఒకసారి చూడాలనుకునే వారు దానికి బానిసలైపోతున్నారు. అప్పటికే అలవాటు పడిన వారు వీరిని ప్రోత్సహిస్తారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉంటున్నారు. విపరీత ప్రవర్తన ఉన్నవారు, చనిపోతానని బెదిరించేవారు, తమను తాము గాయపరుచుకునే వారు మాదక ద్రవ్యాలకు బానిసలైనవారిగా నిర్ధారించవచ్చు. జీజీహెచ్‌లో డీ అడిక్షన్ సెంటర్ ఉంది. ఇది కాకుండా ప్రతి రోజూ మానసిక వైద్యుల ఓపీ కొనసాగుతుంది. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారికి తక్షణ చికిత్స అవసరం. నిర్లక్ష్యం చేస్తే వారికి వారు తమకు తాము లేదా ఇతరులకు హాని కలిగించే ప్రమాదం ఉంటుంది. అలవాటు పడిన వారు దొంగతనాలకు సైతం వెనుకాడరు.

– డాక్టర్ వానపల్లి వరప్రసాద్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్, కాకినాడ

స్మగ్లర్ల ఆటలు సాగనివ్వం



జిల్లాలో ఎక్కడా గంజాయి సాగు లేదు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి, కోలాపురి జిల్లా నుంచి జిల్లాలోకి తరలించేందుకు స్మగ్లర్లు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వారి ఆటలు సాగనివ్వం. హైవే పెట్రోలింగ్‌ను పటిష్టం చేశాం. పరివర్తన కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. గంజాయికి ఎంతో మంది దూరమవుతున్నారు. సెబ్, స్థానిక పోలీసులు మాత్రమే కాకుండా సాగు నిర్ధారణ కోసం శాటిలైట్ పర్యవేక్షణ కూడా కొనసాగుతోంది. కాకినాడ ఏటిమొగ, పోర్టు ప్రాంతాలతో పాటు డంప్ యార్డులు, నిర్మానుష్య ప్రాంతాల్లో పోలీసు నిఘా ఉంటుంది. అదనపు ఎస్పీ శ్రీనివాస్, సెబ్ ప్రత్యేకాధికారి ప్రేమ్ కాజల్ ఆధ్వర్యాన ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. సెబ్ సేవలు సత్ఫలితాలనిస్తున్నాయి.

– సుబ్రమణి సతీష్‌కుమార్, ఎస్పీ, కాకినాడ జిల్లా

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం: స్థానిక శివారు అగ్రహారం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పిఠాపురం పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం పొన్నాడకు చెందిన పి.నాగేశ్వరరావు (62) పిఠాపురం అగ్రహారంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం అగ్రహారం వద్ద 216 జాతీయ రహదారి దాటుతుండగా కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న వ్యాన్ ఢీకొంది. తీవ్ర గాయాలైన నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. పట్టణ ఎస్సై జగన్ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



కొత్తపల్లి: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం శ్రీరాంపురం శివారు పాటివారిపాలేనికి చెందిన పాటి శ్రీనివాస్‌కు కాకినాడ రూరల్ మాధవపట్నానికి చెందిన రూపాదేవి (29)తో 2015లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంత కాలంగా శ్రీనివాస్ తన భార్య రూపాదేవిని వేధిస్తుండడంతో ఆదివారం తెల్లవారుజామున ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై ఇన్‌చార్జి ఎస్సై ఎ.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల బదిలీలు పూర్తి

రాయవరం, బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పూర్వపు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 2008, 1998 డీఎస్సీ మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. ఈ నెల 24న రాత్రి ప్రారంభమైన కౌన్సెలింగ్ 25 వేకువజాము వరకు కొనసాగింది. కాకినాడ సర్వశిక్షాభియాన్ సమావేశపు హాలులో ఆఫ్‌లైన్ విధానంలో డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. 2008 డీఎస్సీకి చెందిన 199 మంది, 1997 డీఎస్సీకి చెందిన 265 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ ద్వారా వారికి కావాల్సిన పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. బదిలీల్లో కోరుకున్న స్థానాలు పొందిన ఉపాధ్యాయులు వెంటనే ఆయా స్థానాల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది.

నిత్య సేవ... ఆధ్యాత్మిక తోవ

- ధార్మిక, సేవలకు ప్రాధాన్యం
- అన్నవరం దేవస్థానం పెద్దపీట
- ఏటా రూ.పది కోట్ల ఖర్చు



ఈఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సేవా, ధార్మిక కార్యక్రమాల ఫ్లెక్సీ

అన్నవరం: ధార్మిక, భక్తుల సేవలతో రత్నగిరి దేవస్థానం తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటోంది. విద్య, అన్నదాన, ఆధ్యాత్మిక ఇలా అనేక కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతోంది.. ఏటా రూ.10 కోట్ల వరకూ వెచ్చిస్తూ నిత్య సేవలతో ముందుకు సాగుతోంది.. రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఖ్యాతికెక్కింది. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ఈ దేవస్థానం సేవా, ధార్మిక కార్యక్రమాలు విరివిరిగా నిర్వహిస్తుంది. ఈ విషయం భక్తులకు తెలపాలని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించడంతో పలుచోట్ల ఈ మేరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అన్నదాన, గోసంరక్షణ పథకానికి గాను దేవస్థానానికి భక్తుల నుంచి విరాళాలు వస్తుండగా, మిగిలిన వాటికి దేవస్థానం స్వచ్ఛందంగా ఖర్చు చేస్తోందని ఈఓ తెలిపారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

దేవస్థానంలో రోజూ సుమారు నాలుగు వేల మందికి అన్నదానం చేస్తున్నారు. ఏడాది పాటు ఒక భక్తునికి భోజనం పెట్టేందుకు రూ.10,950 అవుతోంది. ఏటా ఇలా రూ.4.32 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ పథకానికి భక్తులు ఇచ్చిన విరాళాలు రూ.20 కోట్ల పైబడి ఉన్నాయి. ఏటా రూ.మూడు కోట్ల విరాళాలు వస్తున్నాయి.

పులిహోర, దద్దోజనం వితరణ

సత్యదేవుని దేవస్థానానికి వచ్చే భక్తులకు రోజూ ఉదయం పులిహోర, దద్దోజనం పంపిణీ చేస్తున్నారు. రోజుకు సుమారు వెయ్యి మందికి రూ.14,974 ఖర్చు అవుతోంది. ఇలా ఏటా సుమారు రూ.54 లక్షల వ్యయం అవుతోంది.

మజ్జిగ వితరణకు..

ఏటా వేసవిలో మజ్జిగ వితరణకు సుమారు రూ.28.60 లక్షలు అవుతోంది. ఒక రోజుకు రూ.7,890 ఖర్చు కాగా రోజు సరాసరిన నాలుగు వేల మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

గో సంరక్షణకు రూ.72 లక్షలు

సత్యదేవుని గోశాల, రత్నగిరిపై గోకులంలో ఉన్న 194 గోవులకు మేత, దాణా, వాటి సంరక్షణకు ఏటా సుమారు రూ.72 లక్షలు అవుతోంది. ఒక్క ఆవుకు ఏడాదికి రూ.40 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. మొత్తం 194 గోవులను దేవస్థానం సంరక్షిస్తోంది.

స్మార్త ఆగమ పాఠశాలకు..

సత్యగిరిపై స్మార్త ఆగమ పాఠశాల నిర్వహణకు ఏటా సుమారు రూ.18.25 లక్షలు ఖర్చు చేస్తున్నారు. 28 మంది విద్యార్థులు ఆగమ విద్య అభ్యసిస్తున్నారు. ఒక్క విద్యార్థికి ఏడాదికి రూ.65 వేలు ఖర్చు చేస్తున్నారు. స్మార్త ఆగమ పాఠశాల భవనాలను రూ.ఐదు కోట్లతో నిర్మించి గతేడాది ప్రారంభించారు. సత్యదేవ ఉచిత వైద్యశాల నిర్వహణకు రూ.37.20 లక్షలు ఖర్చు చేస్తున్నారు.



రత్నగిరిపై అన్నదాన పథకంలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



అన్నవరం దేవస్థానం

విద్యా సంస్థలకు..

అన్నవరం దేవస్థానం మూడు విద్యా సంస్థలను నిర్వహిస్తోంది. ఇందులో దేవస్థానం హైస్కూల్‌కు రూ.42.10 లక్షలు, జూనియర్ కళాశాలకు రూ.95.47 లక్షలు, డిగ్రీ కళాశాలకు రూ. 1.75 కోట్లు ఖర్చు చేస్తుంది. హైస్కూల్‌లో విద్యార్థులు 82, జూనియర్ కళాశాలలో 435, డిగ్రీ కళాశాలలో 543 మంది విద్యనభ్యసిస్తున్నారు.



దేవస్థానం భూమిలో మారేడు మొక్కలు నాటుతూ..

దత్తత ఆలయాలకు..

కోరుకొండలోని లక్ష్మీనృసింహస్వామివారి దేవస్థానం, గెద్దనాపల్లిలో వేణుగోపాల స్వామివారి ఆలయం, శంఖవరంలోని మల్లేశ్వరస్వామివారి ఆలయం, ఉప్పలపాడు వేంకటేశ్వరస్వామి ఆలయం, ఏలేశ్వరం సత్యనారాయణ స్వామివారి ఆలయాలను అన్నవరం దేవస్థానం దత్తత తీసుకుని నిర్వహిస్తోంది. దీనికి గాను ఏటా రూ.60 లక్షలు ఖర్చు చేస్తుంది.

భూముల ఆదాయం రూ.15 లక్షలు

దేవస్థానానికి 772.40 ఎకరాల భూమి ఉంది. ఇందులో 616 ఎకరాలు కొండ కాగా, మెట్టభూమి 82 ఎకరాలు, పల్లపుభూమి 73 ఎకరాలు. ఈ భూమి ద్వారా దేవస్థానానికి ఏటా రూ.15 లక్షల ఆదాయం వస్తోంది. 66 ఎకరాలలో మారేడు వనాలను పెంచాలనేది లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 12.15 ఎకరాలలో 1020 మారేడు మొక్కలు నాటారు. ఇంకా 54 ఎకరాలలో ఐదు వేల మొక్కలు నాటాల్సి ఉంది. ఒక మొక్క కొనుగోలుకు రూ.530 అవుతుండగా, పెంచడానికి ఒక మొక్కకు ఏడాది కి రూ.రెండు వేలు ఖర్చు చేస్తున్నారు. ఇలా పదేళ్ల పెంచాల్సి ఉంది.

'డయల్ యువర్' ఈఓ రద్దు

అన్నవరం: రత్నగిరి దేవస్థానంలో సోమవారం 10.30 నుంచి 11.30 గంటల వరకూ జరగాల్సిన డయల్ యువర్ ఈఓ కార్యక్రమం రద్దయ్యింది. ఆలయ ఈఓ చంద్రశేఖర్ అజాద్ విజయవాడ క్యాంపులో ఉండడంతో కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమం ఎప్పుడు జరిగేది త్వరలోనే ప్రకటిస్తారని చెప్పారు.

తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



క్యాడెట్, జూనియర్స్ తైక్వాండో ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులతో డాక్టర్ లక్ష్మి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తూర్పుగోదావరి జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. స్థానిక ఇండియన్ ఇంజినీర్స్ భవన్‌లో జరిగిన ఎంపికలను శ్రావణి హాస్పిటల్ ఎండీ డాక్టర్ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మరక్షణకు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ప్రతిఒక్కరికీ అవసరం అన్నారు. తైక్వాండో కోచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ క్యాడెట్, జూనియర్స్ బాలురు, బాలికల విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. క్యాడెట్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు జూలై 1, 2 తేదీలలో చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. విజయనగరం జిల్లాలో జూనియర్స్ విభాగంలో జూలై 15, 16 తేదీలలో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రాయుడు లక్ష్మణ్, శ్రీను, సతీష్, ఈశ్వరి, బద్రి, శ్రీను, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

అన్నవరం: స్థానిక వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నిర్వహిస్తున్న స్మార్త, ఆగమ పాఠశాలలో 2023-24 స్మార్త ఆగమ కోర్సులో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల కోర్సులో చేరేందుకు ఈ నెల 27వ తేదీ నుంచి జూలై తొమ్మిదో తేదీ వరకూ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పాఠశాల కార్యాలయంలో దరఖాస్తులు ఉచితంగా పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూలై పదో తేదీలోగా కరస్పాండెంట్, వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆగమ పాఠశాల, అన్నవరం, కాకినాడ జిల్లా, 533406 అనే చిరునామాకు పంపించాలన్నారు. విద్యార్థి వయసు తొమ్మిదేళ్ల నుంచి 13 ఏళ్ల మధ్యలో ఉండాలన్నారు. విద్యార్థి చదివి, రాయగలిగి, స్వచ్ఛమైన ఉచ్చారణ కలిగి ఉండాలన్నారు. కమిటీ సభ్యులు విద్యార్థి సర్టిఫికెట్ల పరిశీలన చేసి తర్వాత రిజిస్టర్ పోస్టు ద్వారా ఇంటర్వ్యూ తేదీ తెలియజేస్తారని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఐదేళ్ల పాటు వసతి, దుస్తులు, భోజన సౌకర్యం, నెలకు రూ.500 స్టైఫండ్ (బ్యాంకులో జమ) అందజేస్తారు. కోర్సు పూర్తయ్యాక స్టైఫండ్, దానిపై వడ్డీ విద్యార్థికి ఇస్తారు. వివరాలకు 77298 65645, 94918 81308 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలు



వివిధ విభాగాల్లో బహుమతులు సాధించిన కాకినాడ జిల్లా క్రీడాకారులతో అతిథులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాసకుమార్, గౌరవ అతిథిగా అలయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ అలై వి.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విజేతలు జాతీయస్థాయిలో కూడా రాణించాలన్నారు. పోటీలు విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు. రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూలైలో అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టును త్వరలో ప్రకటిస్తామన్నారు. లేజర్ రన్ విభాగంలో విశాఖ, కాకినాడ, చిత్తూరు, బయాథ్లాన్ విభాగంలో కాకినాడ, విశాఖ, చిత్తూరు, ట్రయాథ్లాన్‌లో విశాఖ, కాకినాడ, చిత్తూరు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి కోటపాటి కృష్ణ, కాకినాడ జిల్లా కోచ్ కట్టా జగన్మోహన్, నిర్వహణా కార్యదర్శి ఉపేంద్రనాథ్, స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు అలై కిరణ్‌కుమార్, అలయన్స్ క్లబ్ కోశాధికారి అలై సతీష్, డీఎస్ఏ కోచ్ రాజాషేక్, వెంకటరమణ పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడిన యువకుడు

- రెండు కాళ్లూ కోల్పోయిన వైనం



ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన ప్రయాణికుడు నరేష్

రాజమహేంద్రవరం సిటీ: రైలు ఎక్కుతూ జారిపడి తన రెండు కాళ్లూ ఓ యువకుడు కోల్పోయాడు. ఈ ఘటన రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి విజయనగరం వరకూ ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అంజనాపురం గ్రామానికి చెందిన దుహారి నరేష్ (26) ఇంటర్వ్యూ నిమిత్తం జనరల్ బోగీలో ప్రయాణిస్తున్నాడు. అయితే రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వచ్చేసరికి జనరల్ బోగీ ఇబ్బందికరంగా ఉండటంతో ఏసీ బోగీ ఎక్కేందుకు నిర్ణయించుకున్నాడు. తన లగేజీ తీసుకుని ఏసీ బోగీ ఎక్కే సమయంలో రైలు కదలడంతో నరేష్ ప్రమాదానికి గురయ్యాడు. నడుస్తున్న రైలు కింద పడిపోవడంతో నరేష్ రెండు కాళ్లపై నుంచి రైలు చక్రాలు ఎక్కడంతో నుజ్జునుజ్జయ్యాయి. రైల్వే అధికారులు, పోలీసులు వెంటనే స్పందించి ప్రమాదం బారిన పడిన నరేష్‌ను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులు యువకుడికి రెండు కాళ్లూ తొలగించారు. యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.



నరేష్ (ఫైల్)

గోదావరి తీరం.. నృత్య సోయగం

- ముగిసిన కళా సమ్మేళనం 2023
- నృత్య రూపకాలతో అలరించిన కళాకారులు



బృందావనం నృత్యరూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గోదావరి తీర ప్రాంతంలో రెండు గంటల పాటు సాగిన బృందావనం నృత్య రూపకం ఆహుతులను అలరించింది. బృందావనమది అందరిది.. గోవిందుడు అందరివాడేలే అంటూ గోపికలు కృష్ణుని వద్ద చేరి ఆనంద పరవశంతో నృత్యం చేశారు. కృష్ణుడు తనకి మాత్రమే సొంతం అంటూ రాధ నాట్యం చేయగా, కృష్ణుడు ఆట పట్టించే ఘట్టం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. చూడచక్కని అభినయంతో చిన్నారులు కృష్ణునిగా, రాధగా, గోపికల వేషధారణతో నృత్యం చేస్తుంటే ప్రేక్షకులు తన్మయత్వం చెందారు. కళాసమ్మేళనం 2023 పేరిట రాజమహేంద్రవరంలోని శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సంగీత, నృత్య పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. 22న ప్రారంభించిన ఈ కార్యక్రమంలో తొలిరోజే నాలుగు ప్రపంచ రికార్డులు నమోదు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కూడా కళాకారులు హాజరయ్యారు. నాలుగు రోజుల పాటు సాగిన ఈ పోటీల్లో 756 మంది కళాకారులు సంగీత, నృత్య, జానపద పోటీలలో పాల్గొన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, యూత్ విభాగాలలో కూచిపూడి, ఆంధ్రనాట్యం, జానపదం, శాస్త్రీయ సంగీతంలో గాత్రం, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, లైట్ మ్యూజిక్, సెమీ క్లాసిక్‌లో 100 మందిని విజేతలుగా ప్రకటించారు. పది మందికి స్పెషల్ జ్యూరీ అవార్డులు ప్రదానం చేశారు. ప్రఖ్యాత నాట్యకారిణి శోభానాయుడు ప్రథమ శిష్యురాలు డాక్టర్ యశోద ఠాకూర్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ పి.సత్యవేణి చేతుల మీదుగా విజేతలకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు జీబీ నారాయణ, కుశల్ భట్టాచార్య, ఉమాజయశ్రీ, పోతిన శ్రీనివాస్, వై.వాణి తదితరులు పాల్గొన్నారు. హనుమాన్ చాలీసా కోసం 100 మంది నృత్య కళాకారులకు ఆరు నెలలుగా శిక్షణ ఇచ్చానని నాట్యకారిణి లక్ష్మీదీపిక తెలిపారు. వరల్డ్ రికార్డ్స్ కోసం ఎక్కడా ఏ తప్పు లేకుండా నాట్యం చేయగలిగామన్నారు.



రాధగా అభినయిస్తున్న నాట్యకారిణి

న్యాయ నిర్ణేతగా ఉండడం కష్టం

చిన్నారులు ఎంతో కష్టపడి నాట్యసాధన చేస్తారు. పోటీలలో కొంత భయంతో కొన్ని భంగిమలు మరిచిపోతారు. అందరూ బాగా చేసినప్పటికీ ఉత్తమమైన విజేతలుగా వారినే ప్రకటించాలి. యూఎస్ఏ, సిమ్లా, డెహ్రాడూన్, జయపూర్ వంటి చోట్ల న్యాయ నిర్ణేతగా వ్యవహరించాను. కళాకుంజ్, కళావైభవ్, అభినయ గురుశ్రీ, ఆటా అవార్డు, అంతర్జాతీయ ఉత్తమ కూచిపూడి నృత్య దర్శకురాలిగా అవార్డులను తీసుకున్నాను.

– జి.ఉమాజయశ్రీ, నాట్యగురువు, రాజమహేంద్రవరం

మీరే బలం... బలగం

- వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేద్దాం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలు, నాయకులే బలం.. బలగమని.. పార్టీని రెండోసారి అధికారంలోకి తీసుకు రావడానికి సైనికుల్లా చిత్తశుద్ధితో పనిచేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టడానికి రానున్న పది నెలలూ పార్టీ అన్ని అనుబంధ విభాగాల నాయకులు కష్టించి పని చేయాలని అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం సంహిత కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ సేవాదళ్ (రీజినల్) మండల కన్వీనర్ల సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకైనా అనుబంధ విభాగాలు అత్యంత కీలకమని, అలాగే వైఎస్సార్ సీపీ అన్ని అనుబంధ విభాగాలను గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ బలోపేతం చేయడంపై ముఖ్యమంత్రి, పార్టీ పెద్దలు నిర్ణయించారన్నారు. వైఎస్సార్ సీపీకి సంబంధించి సేవాదళ్ అత్యంత కీలకమైన అనుబంధ విభాగమన్నారు. ఈ సమావేశానికి హాజరైన వారంతా ఒక్కో మండలానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందున రానున్న కాలంలో గ్రామ స్థాయి నుంచి సేవాదళ్‌ను బలోపేతం చేయాలని కోరారు. సేవాదళ్ రీజినల్ అధ్యక్షుడిగా ఉన్న చినిమిల్లి వెంకట్రాయుడు పట్టుదల, నిబద్ధత కలిగిన వ్యక్తి అన్నారు. నామినేటెడ్ పదవి వద్దని, పార్టీకి సేవ చేసే పదవి కావాలని కోరుకున్న వ్యక్తి అని కొనియాడారు. పార్టీ మనుగడ సుస్థిరంగా ఉండాలంటే క్షేత్రస్థాయి నుంచి సంస్థాగతంగా బలపడాలన్నారు. దీనికి సేవాదళ్ నేతలంతా తమవంతు పాత్ర నిర్వర్తించాలని విజ్ఞప్తి చేశారు. మండల సేవాదళ్ అధ్యక్ష పదవి తేలికగా తీసుకోవద్దని, అందించే సేవలను బట్టి పదవులు వాటంతటవే వస్తాయని గుర్తుంచుకోవాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు డాక్టర్ బాబు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు మంగళంపల్లి అంజిబాబు, పశ్చిమగోదావరి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బల్లె ఏసుబాబు, ఏలూరు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు భలే నాగరాజు, కాకినాడ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, ఐదు జిల్లాల మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

సాంకేతికతతో విద్యారంగం అభివృద్ధి

- ఆంధ్రా ఎలక్ట్రికల్స్ సీఈఓ శ్రీధర్

గండేపల్లి: సాంకేతికత ఆధారంగా విద్యా రంగాన్ని అభివృద్ధి చేయాలని ఆంధ్రా ఎలక్ట్రికల్స్ సీఈఓ కె.శ్రీధర్ అన్నారు. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఐఈఈఈ విశాఖ బే సెక్షన్‌తో కలసి అడ్వాన్స్‌డ్ గ్లోబల్ ఇంజినీరింగ్ చాలెంజెస్ (ఏజీఈసీ)పై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి ఇంజినీర్లు కొలువుల కోసం ఎదురు చూడకుండా ఇన్నోవేషన్‌పై దృష్టి సారించాలన్నారు. వక్తలు మాట్లాడుతూ ఇటువంటి కాన్ఫరెన్స్‌లతో నేటి ఇంజినీరింగ్ సవాళ్లను అధిగమించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. యువత పరిశోధనల ద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించాలన్నారు. ఆదిత్యలో ఈ రకమైన ఐఈఈఈ కాన్ఫరెన్స్ మొదటిదన్నారు. ఈ సదస్సులో పవర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్ రోబోలు, మెషీన్ లెర్నింగ్, ఇమేజ్ ఫ్యూజన్, ఎంబెడెడ్ సిస్టమ్, 5జీ కమ్యూనికేషన్స్ విభాగాల్లో పేపర్లు సమర్పించారు. 34 మంది పరిశోధకులు తమ పత్రాలు సమర్పించారు. డీన్ డాక్టర్ కేవీఎస్ఆర్ మూర్తి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఐటీ జంషెడ్‌పూర్, జాదవ్‌పూర్ విశ్వ విద్యాలయం, ఎస్ఆర్ఎం, వీఐటీ చండీఘడ్ విశ్వవిద్యాలయం, ఎన్‌బీకేఆర్ విద్యానగర్, గీతం, ఎస్ఆర్ విశ్వవిద్యాలయం, వరంగల్, న్యూహారిజన్ బంగ్లోర్, నియోటియా విశ్వవిద్యాలయం నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, దోలా సంజయ్, ఆదిరెడ్డి రమేష్, డీన్‌లు ఎం.రమశ్రీ, కేవీఎస్ఆర్ మూర్తి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



ముగింపు సదస్సులో పాల్గొన్న ప్రతినిధులతో ఆదిత్య సిబ్బంది

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER



MINI GEEZER
■ శ్రీ గాయత్రి మినీ గీజర్స్ (5 sec.లో వేడి నీళ్ళు) సేల్స్ చేయుటకు డీలర్స్ కావలెను. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం. సంప్ర. సెల్ : 96663 32323, 95506 92836. [M-1221206]

GOLD FINANCE



■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781985]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted

■ ప్రముఖ సంస్థలో కాకినాడ, రాజమండ్రి, విశాఖపట్నం, హైదరాబాద్‌లో పనిచేయుటకు నిరుద్యోగ యువతి యువకులు, రిటైర్డ్ ఉద్యోగులు కావలెను. అనుభవం బట్టి ప్రాధాన్యత. ✆ : 94940 42487, 98498 22088 [R-1833]

■ మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221325]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు కావలెను,ఆయా, వార్డ్ బాయ్స్,నర్సులు, వంటవారు, RMP Dr. Q5th-Degree, 10-30 వేల జీతం, భో+రూం ఫ్రీ. Hyd. ఫోన్: 7995984445. [HA-340]

■ బ్యాంక్‌లలో (ఆఫీస్ వర్క్) పర్మినెంట్‌గా Q: 10th- డిగ్రీ జీ॥ 26,000/- కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ @Ph: 83328 09093 [H-781446]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K హైదరాబాద్ : 96402 58899, విజయవాడ: 96406 48899 [HA-337]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.